క్లుప్తంగా

ఏవో బాధ్యతల స్వీకరణ



అజయ్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: మండల వ్యవసాయాధికారిగా పాలిమేర పైడి వెంకట విశ్వేశ్వర అజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ తారపురెడ్డి భార్గవి పాడేరు వ్యవసాయ టెక్నికల్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లిపోయారు. మండలంలోని వ్యవసాయాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అన్నదాతలకు అండగా ఉంటానని ఏవో తెలిపారు.

విత్తనశుద్ధితో చీడపీడల నివారణ



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సోంపేట: ఖరీఫ్ సాగు చేసే రైతులు వరి విత్తనాలను శుద్ధి చేయడం వలన చీడపీడలు నివారించవచ్చునని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. పలాసపురంలో రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విత్తనశుద్ధితో అగ్గి తెగులు, పాడ తెగులను అరికట్టవచ్చునని పేర్కొన్నారు.

పేస్కేల్ అమలు చేయాలని వినతి



ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

పలాస: గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని వీఆర్ఏ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను తన కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హత ఉన్న వీఆర్ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని, ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని, నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ 20 శాతం నుంచి 70 శాతానికి పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మణరావు, కార్యదర్శి బి.తిరుపతిరావు, సీహెచ్ సింహాచలం పాల్గొన్నారు.

చెవిరెడ్డి అరెస్టు అన్యాయం



సింగుపురం మోహన్‌రావు

టెక్కలి: వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగుపురం మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అక్రమంగా లిక్కర్ స్కాం పేరుతో గతంలో పనిచేసిన చెవిరెడ్డి గన్‌మెన్‌లపై సిట్ అధికారులు వ్యవహరించిన తీరు హేయనీయమన్నారు. అబద్ధపు వాంగ్మూలం కోసం అధికారులు ప్రవర్తించిన తీరు పూర్తిగా రెడ్‌బుక్ రాజ్యాంగమేనని మండిపడ్డారు. ఏ సమయంలోనైనా విచారణకు సిద్ధంగా ఉన్నానని చెవిరెడ్డి చెబుతున్నప్పటికీ లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసి అరెస్ట్ చేయడం పూర్తిగా కుట్రపూరితమేనని పేర్కొన్నారు. ఇలాంటి కుట్ర పూరితమైన చర్యలు మానుకోకపోతే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు.

పారిశుద్ధ్య పనులపై స్పందించని అధికారులు

- టెక్కలి మండల సమావేశంలో సభ్యులు ఆరోపణ



పారిశుద్ధ్య పనులపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

టెక్కలి రూరల్: పారిశుద్ధ్య పనులపై అధికారులే స్పందించడం లేదని కోటబొమ్మాళి మండలానికి చెందిన పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అన్నారు. రానున్నది వర్ష కాలం కావడంతో ప్రజలు రోగాలు బారిన పడకుండా ఉండేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోటబొమ్మాళి మండల ఈవోపీఆర్‌డీ జె.ఆనందరావు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు సూచించడంతో వెంటనే స్పందించిన సభ్యులు తాము గ్రామాల్లో పారిశుద్ధ్యపనులు నిర్వహించడానికి సిద్ధంగానే ఉన్నామని.. అధికారులే ముందుకు రావడం లేదని సభ్యులు బదులిచ్చారు. కోటబొమ్మాళి మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసి సుమారు రెండు నెలలు కావస్తున్న ఇప్పటి వరకు అవి పంచాయతీల ఖాతాల్లో జమకాలేదని పలువురు సర్పంచ్‌లు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ దృష్టికి తీసుకొచ్చారు.

శంకుస్థాపనకు ఆరేళ్లు!

- అయినా పూర్తికాని రోడ్డు నిర్మాణం
- తీవ్ర నైరాశ్యంలో మూడు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని ఎమ్మెల్యే అశోక్



బలియాపుట్టుగ గ్రామం వద్ద రోడ్డు పరిస్థితి



ఎమ్మెల్యే అశోక్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

కంచిలి: ఆరేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు నేటికీ పూర్తికాలేదు. స్వయాన టీడీపీ ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన రోడ్డు పూర్తికాకపోవడంతో మూడు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గడచిన టీడీపీ ప్రభుత్వ హయాంలో పక్కా రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దాన్ని పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. కేవలం పైపై పనులు చేసి, చేతులు దులుపుకున్న సంఘటన ఇది. ఈ పరిస్థితి ఏదో మారుమూల ప్రాంతం అనుకుంటే తప్పులో కాలేసినట్టే. మండల కేంద్రం కంచిలిలో జాతీయ రహదారి నుంచి బలియాపుట్టుగ, చిన్నపాత్రపడ, పెద్దపాత్రపడ గ్రామాలకు వెళ్లే రహదారి నిర్మాణానికి 2019 జనవరి 24న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రస్తుత ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల పథకం కింద 90 మీటర్ల సీసీ రహదారి నిర్మాణానికి రూ. 93.19 లక్షలు నిధులు నిధులు మంజూరు చేశారు. తర్వాత కాలంలో తారు రోడ్డుగా అభివృద్ధి చేస్తామని అధికారులు చెప్పారు. ఇందుకోసం కంకర రాళ్లు, క్రషర్ గుండతో కొంతమేర పనులు చేశారు. తర్వాత విడిచిపెట్టేశారు. దీంతో ఆరేళ్ల పాటు గ్రామస్తులు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో, క్రషర్ గుండకు సంబంధించిన ధూళి వాహనాలు రాకపోకలు చేసేటప్పుడు ఎగిరి పడుతుండడంతో సమీపంలో ఉన్నవారు అవస్థలు పడుతున్నారు. ఇంతజరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినప్పటికీ ఈ రోడ్డు నిర్మాణం సంగతి పట్టించుకోకపోవడంతో మూడు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తమ గ్రామాలకు మంజూరైన రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే అశోక్ ప్రత్యేక దృష్టిసారించాలని వేడుకుంటున్నారు.

అవస్థలు పడుతున్నాం..



బలియాపుట్టుగ, చిన్నపాత్రపడ, పెద్దపాత్రపడ గ్రామాల ప్రజల ప్రయాణ అవసరాలు తీర్చాల్సిన రోడ్డు నిర్మాణం ఇంతవరకు పూర్తిచేయలేదు. దీంతో ఎన్నో అవస్థలు పడుతున్నాం. వాహనాలు రాకపోకలు సాగించేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి. – కల్లా మురళి, బలియాపుట్టుగ గ్రామం, కంచిలి మండలం

వాహనదారుల అవస్థలు



మూడు గ్రామాలకు పక్కా రోడ్డు నిర్మాణం లేక ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నాం. చాలా సంవత్సరాల క్రితం పూర్తిస్థాయిలో రోడ్డు వేస్తామని కొంతమేర పనులు చేశారు. తర్వాత విడిచిపెట్టేశారు. దీని వలన రాళ్లు తేలుతుండటంతో వాహనదారులు రాకపోకలు సాగించడానికి చాలా అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా తమ గ్రామాలకు మంజూరైన రోడ్డును పూర్తి చేయాలి. – కల్లా రాము, బలియాపుట్టుగ గ్రామం, కంచిలి మండలం

రైతులకు అవగాహన



రైతులు సైబర్ నేరస్తుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా పలాస బ్రాంచ్ అధికారులు అన్నారు. కస్టమర్లు, రైతులతో కలిసి అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. మొబైల్‌కు ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని, ఏటీఎం నంబర్లు చెప్పమని బ్యాంకు అధికారులు అడగరని చెప్పారు. ఎవరికైన ఇలాంటి ఫోన్లు వస్తే అప్రమత్తంగా ఉండడంతో పాటు బ్యాంకు సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతు ఖాతాదారులను సత్కరించారు. బ్యాంక్ మేనేజర్ బొడ్డేపల్లి భార్గవి, ఆఫీసర్లు హరిప్రసాద్, లోకనాథం, సిమ్రాన్, లోహిత్, లోన్ ఆఫీసర్ కొత్తపల్లి చిన్నవారి పాల్గొన్నారు. – కాశీబుగ్గ

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఇచ్ఛాపురం మండలం బొడ్డఖాళీ గ్రామంలో జరుగుతున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సాధరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజా కార్యక్రమంలో స్వామి వారి సేవల్లో తరింపజేశారు. ఆమె వెంట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు చల్లా కృష్ణారెడ్డి, గుజ్జు ఢిల్లీరావు, ప్రియా నాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన



ప్రతీ ఇంటికి జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా అమృత జలాలు అందిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం బెండి, నువ్వలరేవు, మంచినీళ్లపేట గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. బెండిలో రూ.1.30 కోట్లు, మంచినీళ్లపేటలో రూ.1.50 కోట్లు, నువ్వలరేవులో 1.50 కోట్లుతో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించి ఆయా గ్రామాల ప్రజలకు శుద్ధ జలాలు అందిస్తామని చెప్పారు. ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు మోహనరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.ఈశ్వరరావు, అంబటి రామక్రిష్ణ పాల్గొన్నారు. – వజ్రపుకొత్తూరు

'తల్లికి వందనం'లో కోతలెందుకు?

- మండల సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు



తల్లికి వందనం పథకంపై ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామన్న కూటమి ప్రభుత్వం పథకం అమలులో కోతలు విధించడం ఎందుకని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యాశాఖపై సమీక్షలో ఎంఈవో కురమాన అప్పారావు తల్లికి వందనం పథకం గురించి మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ జోక్యం చేసుకొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పథకానికి అర్హులైన వారందరికీ అమ్మఒడి పథకాన్ని వర్తింపజేశారని, కూటమి ప్రభుత్వం మాత్రం 300 విద్యుత్ యూనిట్లు, రూ.10 వేలుకు రూరల్‌లో పనిచేసే ఉద్యోగులు, అర్బన్‌లో రూ. 12 వేలుకు పనిచేసే ఉద్యోగుల పిల్లలకు పథకం వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. అలాగే వందలాది అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు పథకం అందకుండా పోయిందని అన్నారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుడ్లు, పాలు, బాలామృతం వంటి ఆహార పదార్థాలు పక్కదారి పడుతున్నాయని బిర్లంగి, బూర్జపాడు ఎంపీటీసీ సభ్యులు దక్కత ఏకాంబరి, దున్న గురుమూర్తిలు ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత ఏడాది నవంబర్‌లో ఈదుపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు బాహుదా ఛానెల్స్ కోసం రూ. 20 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారని, దాదాపు ఏడు నెలలు కావస్తున్నా ఇంత వరకు పనులు ఎందుకు ప్రారంభించలేదని ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్ ఇరిగేషన్ జేఈ మధుసూదన పాణిగ్రాహిని ప్రశ్నించారు. ఫైనాన్స్ లోటులో ఉండటంతో నిధులు మంజూరు కాలేదని జేఈ వివరణ ఇచ్చారు. ఉపాధి, వెలుగు, వ్యవసాయం, ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ శాఖల సమీక్షలపై సంబంధిత అధికారులను సభ్యులు ప్రశ్నించారు. ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీడీవో కె.రామారావు పాల్గొన్నారు.

శంకుస్థాపనలకే ఎమ్మెల్యే పరిమితం

- వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

వజ్రపుకొత్తూరు: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అభివృద్ధిని విస్మరించి కేవలం శంకుస్థాపనల ఆర్భాటాలకే పరిమితమయ్యారని వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వజ్రపుకొత్తూరు మండలంలో ప్రధాన రహదారుల అభివృద్ధిని ఎమ్మెల్యే విస్మరించారన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ యు.నీలవేణి, జెడ్పీ వైస్ చైర్మన్ పాలిన శ్రావణి, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు అక్కుపల్లి– కాశీబుగ్గ, రేగులపాడు–నువ్వలరేవు రహదారులు నిర్మించాలని ఎమ్మెల్యే శిరీషకు వినతి పత్రం అందించి నిలదీశామన్నారు. దీనికి స్పందించిన ఆమె పది రోజుల్లో నిర్మిస్తామని చెప్పినప్పటికీ రోడ్డుపై తట్టెడు మట్టి వేయలేని అసమర్థ పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నువ్వలరేవు రహదారి పది కిలో మీటర్ల మేర, అక్కుపల్లి–కాశీబుగ్గ రహదారి ఆరు కిలో మీటర్లు నిర్మించామన్నారు. మిగిలిన ఐదు కిలో మీటర్లు నిర్మించేందుకు కూటమి ప్రభుత్వానికి ఏడాది సరిపోక పోవడం సిగ్గుచేటు అన్నారు. వీధి రోడ్లు వేస్తే సరిపోదని, ప్రధాన రహదారులపై దృష్టి సారించడంలో విఫలమైయ్యారన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించి మంచినీరు అందించడం ప్రజలకు అవసరమేనని.. అయితే శంకుస్థాపనలకే పరిమితం చేయవద్దని హితవు పలికారు. మండలంలో 11 తారురోడ్లు నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ఎమ్మెల్యే శిరీష వాటి ప్రగతి ఎక్కడవేసిన గొంగలి అక్కడే అనే చందంగా ఉన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. అమ్మకి వందనం రూ. 30 లక్షల మందికి ఎగనామం పెట్టారని, ఉచిత బస్సు ప్రయాణం జాడ లేదని, అసలు సూపర్ సిక్స్ పథకాలే బూటకమని అన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి సర్కార్



కవిటి: పుస్తకావిష్కరణలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కవిటి: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆరోపించారు. 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం'పుస్తకాలను కవిటిలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంతో కూటమి సర్కార్ విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కడియాల ప్రకాష్, జల్లు యుగంధర్, పి.నేతాజీ, గోపయ్య, నీలయ్య, ప్రకాష్, బి.శివసాయి, భద్రాచలం, వల్లభరావు పాల్గొన్నారు.

కూటమి సర్కార్‌కు గుణపాఠం తప్పదు

ఇచ్ఛాపురం రూరల్: కూటమి సర్కార్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. బొడ్డఖాళీ గ్రామంలో 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి సర్కార్ విఫలమైందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పి.రాజశేఖరరెడ్డి, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, కారంగి త్రినాథ్‌రెడ్డి, ఇసురు తులసీరాం, దుక్క ధనలక్ష్మి, సల్ల దేవరాజు, లోపింటి దీనబందురెడ్డి, కారంగి మోహనరావు, ప్రియా నాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోలకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

టెక్కలి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు టెక్కలి మండల విద్యా శాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు తదితరులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. మరో మండలానికి బదిలీ అయిన ఉపాధ్యాయులకు అక్కడ జీతాలు తక్షణమే పొందే ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. 2024 సాధారణ ఎన్నికల్లో విధులు చేపట్టిన ఉపాధ్యాయులకు ఈఎల్ మంజూరు చేయాలని, ఎస్ఆర్‌లు అప్‌డేట్ చేయాలని కోరారు. పి.గణపతి, కె.దాలయ్య, కుమారస్వామి, బి.అరుణ్‌కుమార్, శ్రీనివాసరావు, డి.పాపారావు, చిన్నవాడు ఉన్నారు.

అధికారులు పక్షపాత వైఖరిని విడనాడాలి

- కవిటి మండల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు, ఎంపీపీ పద్మ

కవిటి: అధికారులు పక్షపాత వైఖరిని విడనాడాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియ విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ప్రజాక్షేత్రంలో గెలిచిన తమను కాదని కూటమి కార్యకర్తలకు అందలమెక్కించేలా మండల అధికారులు వ్యవహరిస్తున్న వైఖరి దురదృష్టకరమన్నారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన బుధవారం కవిటి మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ, గ్రామీణ నీటిసరఫరా, జల్‌జీవన్‌మిషన్, ఉద్దానం నీటిపథకం, వ్యవసాయశాఖ అధికారుల పనితీరుపై జెడ్పీ చైర్‌పర్సన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఫోన్‌చేసినా ట్రాన్స్‌కో ఏఈ యూ.శ్రీనివాసరావు స్పందించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కనీసం ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాను సూచించిన పనికూడా చేయలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఏంచేశారని ప్రశ్నించగా ఏఈ నీళ్లనమిలారు. త్రీఫేస్ సప్లై పనులు మండలంలో ఎంతవరకు వచ్చాయని అడిగినా దానికి సంబంధించి కనీసం గ్రామం పేరు, లైన్‌రూట్‌పై కూడా అవగాహన లేనివిధంగా ఏఈ స్పందించిన తీరుపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లాపరిషత్ సమీక్షలో ఎస్ఈ దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకెళ్తానని వెల్లడించారు. వరక గ్రామ ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారావు కూడా ఏఈ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ సిబ్బంది విత్తనాల పంపిణీలో స్థానిక సంస్థల ప్రతినిధులను ఎందుకు ఆహ్వానించడం లేదని సభ్యులు పూడి నేతాజీ, దుద్ది సతీష్‌లు వ్యవసాయాధికారి శ్రీదేవిని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం రూ.700 కోట్లతో ఏర్పాటు చేసిన జల్ జీవన్ మిషన్ ప్రాజెక్ట్‌ను ఎప్పుడు అందుబాటులోకి తెస్తారని జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, సభ్యులు బి.శ్రీరాంప్రసాద్, బద్రి ప్రకాష్‌లు గ్రామీణనీటి సరఫరా, ఉద్దానం ప్రాజెక్ట్ అధికారులను ప్రశ్నించారు. ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, డీటీ ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రూ. 81 వేల ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం గ్రామానికి చెందిన గిరిధర శెట్టి కుమారుడు రాజేష్ శెట్టి ఇటీవల మృతి చెందాడు. ఎదిగొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు పుట్టెడు శోకంలో మునిగిపోయారు. పేదరికంతో బాధపడుతున్న ఆ కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలబడ్డారు. గ్రామస్తులు, మృతుని స్నేహితులు రూ.51,200, కేదారిపురం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు రూ. 30 వేలు సేకరించారు. మొత్తం 81,200 రూపాయలను మృతుని తండ్రి గిరిధర్ శెట్టికి బుధవారం అందజేసి ఔదర్యాన్ని చాటారు.

కొత్తరకం వరి విత్తనాలు పంపిణీ

కవిటి: శాస్త్రవేత్తలు రూపొందించిన నూతన వరివంగడాల మినీకిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ సమకూర్చిన నూతన వరి విత్తనాల కిట్లను రైతులకు ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. ఆర్‌జీఎల్ 7039, ఆర్‌జీఎల్ 7038, ఆర్‌జీఎల్ 7034 రాకల విత్తనాలను పంపిణీ చేసినట్టు వ్యవసాయశాఖ ఏడీఏ కె జగన్మోహన్‌రావు చెప్పారు. కవిటి మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి, రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఉదయ్‌కుమార్, వ్యవసాయాధికారులు బి.నరసింహమూర్తి, కొంక్యాన సురేష్, అభ్యుదయ రైతులు ఉప్పాడ వాసుదేవరెడ్డి, బల్లెడ రవి, పూడి హరినారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో ఇంజినీరింగ్ విభాగం, పారిశుద్ధ్య కార్మికులకు కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకానికి మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులను అనర్హులను చేయడం పట్ల మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బుధవారం నిరసన తెలియజేశారు. ముందుగా పట్టణం ప్రధాన మార్గంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.